క్లుప్తంగా

క్యాండిల్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న అధికారులు

కర్నూలు(హాస్పిటల్): కోల్‌కతాలో వైద్య విద్యార్థిని అత్యాచారం, హత్యకు నిరసనగా శనివారం సాయంత్రం డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఉద్యోగులు కొవ్వొత్తులు వెలిగించి సంఘీభావం తెలిపారు. ర్యాలీ డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు సాగింది. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై యువత అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరా శాంతి

కర్నూలు(హాస్పిటల్): ఎయిడ్స్/హెచ్ఐవీపై యువత అవగాహన పెంచుకుని జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల(పురుషులు) ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరా శాంతి సూచించారు. జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం సహకారంతో విజయ మహిళా మండలి ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎయిడ్స్ గురించి విజయ మహిళా మండలి ప్రాజెక్టు మేనేజర్ శివకుమార్ వివరించారు. కార్యక్రమంలో పాజిటివ్ నెట్‌వర్క్ ప్రెసిడెంట్ సుధారాణి, ప్రసాద్ పాల్గొన్నారు.

రాధా గోవింద ఝులన్ ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకారంలో జగన్నాథ్, బలదేవ్, సుభద్రా మూర్తులు

కర్నూలు కల్చరల్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో శ్రీ రాధా గోవింద ఝులన్ యాత్ర మహోత్సవా లు ఘనంగా ప్రారంభమయ్యాయి. జగన్నాథ్, బలదేవ్, సుభద్రా మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. వైభవంగా ఉయ్యాల సేవ నిర్వహించారు. ఇస్కాన్ ప్రవచకులు వైష్ణోకృప చైతన్య ప్రభు సందేశమిచ్చారు.

స్థలం కేటాయించాలని వినతి



కలెక్టర్‌ను సన్మానిస్తున్న సొసైటీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లా రెవెన్యూ ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఫంక్షన్ హాల్ కోసం 20 సెంట్ల స్థలాన్ని కేటాయించాలని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణయ్య, ప్రేమ్‌సాగర్ కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కోరారు. శనివారం వారు కలెక్టర్‌ను ఆయన చాంబరులో కలిసి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం స్థలం కేటాయించాలని వినతిపత్రం ఇచ్చారు. స్థలం కేటాయిస్తే రెవెన్యూ, ఇతర ఉద్యోగుల ఫంక్షన్లు, మీటింగ్‌లు నిర్వ హించుకోవడానికి అనువుగా హాల్ నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు కిష్టోఫర్, కృష్ణమూర్తి, రామన్న పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో మృతి చెందిన అలిగిరి బోయ మల్లికార్జున

దేవనకొండ: మండలంలోని పి.కోటకొండ–బేతపల్లి గ్రామాల మధ్య శనివారం ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. కోడుమూరు మండలం కల్లపరి గ్రామానికి చెందిన అలిగిరి బోయ మల్లికార్జున(36) శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ట్రాక్టర్ (ఇంజిన్ నంబర్ 3105ఈఎల్‌వీ34కే1376907ఎఫ్20, చాసిస్ నంబర్ బీజెడ్‌పీఎస్‌పీ139237053) ట్రిర్లు వేసుకుని బేతపల్లి నుంచి ఈదుల దేవరబండ వైపు వస్తుండగా బేతపల్లి గ్రామంలోని బోయకొండయ్య పత్తి పొలం వద్ద మలుపు తిప్పే క్రమంలో ట్రాక్టర్ బోల్తా పడింది. ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో మల్లికార్జున అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి అలిగిరి బోయ రాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

మెరుగైన వసతులు కల్పించండి

- వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఆచార్య ఎన్‌టీకే నాయక్



వర్సిటీ హాస్టళ్ల ఉద్యోగులతో సమీక్ష నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలోని మెస్స్, ఉమెన్స్ హాస్టళ్లలో మెరుగైన వసతుల కల్పనకు అందరూ కృషి చేయాలని వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ అన్నారు. శనివారం వర్సిటీ సెనేట్ హాల్‌లో హాస్టల్స్ చీఫ్ వార్డెన్, వార్డెన్, డిప్యూటీ వార్డెన్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీ అనుబంధ హాస్టళ్లన్నింటిలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. హాస్టళ్ల సమస్యలపై విద్యార్థుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. తరగతులు జరిగే సమయంలో విద్యార్థులు హాస్టళ్లలో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్సిటీ ప్రాంగణంలో విద్యార్థులు ఎప్పుడు పడితే అప్పుడు రాకపోకలు సాగించకుండా చూడాలన్నారు. నిర్ణీత సమయం వరకే హాస్టళ్లలోకి అనుమతించాలన్నారు. విద్యార్థులు అందరూ క్రమశిక్షణతో మెలగాలన్నారు. హాస్టళ్లలో పరిశుభ్రతకు పెద్దపీట వేయాలన్నారు. హాస్టళ్ల్స్ ఉద్యోగులు అందరూ ఏమాత్రం అలసత్వం లేకుండా సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించాలన్నారు. హాస్టళ్లలోని నీటి కొరత సమస్యను జిల్లా మంత్రుల దృష్టికి తీసుకుపోవడం జరిగిందన్నారు. కర్నూలు నగర పాలక సంస్థకు రూ.80 లక్షలు చెల్లించి పైపులైను నిర్మాణం చేపట్టినా నీటి సరఫరా కావట్లేదన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, చీఫ్ వార్డెన్ ఆచార్య సి.విశ్వనాథరెడ్డి, వార్డెన్ డాక్టర్ వై.హరిప్రసాదరెడ్డి, డిప్యూటీ వార్డెన్లు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోండి

కర్నూలు(అగ్రికల్చర్): భారీ వర్షానికి ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నష్టపోయిన దిగుబడుల రైతులను ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం నేతలు శనివారం జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, జిల్లా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు నారాయణమూర్తికి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ఈనెల 16న కురిసిన భారీ వర్షం వల్ల ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మురుగు నీటి కాల్వలు పొంగిపార్లి వేరుశనగ దిగుబడుల్లో కొన్ని బస్తాలు కొట్టుకుపోగా, మరికొన్ని బస్తాలు పూర్తిగా తడిచిపోయాయన్నారు. దాదాపు 5,722 వేరుశనగ బస్తాలకు నష్టం వాటిల్లిందన్నారు. తడిచిన వేరుశనగను క్వింటాలుకు 5 కిలోల చొప్పున తరుగు ఇస్తేనే కొనుగోలు చేస్తామంటున్నారని, మార్కెట్ కమిటీ నిర్లక్ష్యానికి రైతులను బలి చేయడం తగదని వారు అన్నారు. నష్టపోయిన రైతులకు మార్కెట్ కమిటీ ద్వారా నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశా రు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఆంజనేయులు, శివన్న, మద్దిలేటి, కృష్ణ పాల్గొన్నారు.

హోమ్స్‌ను పరిశీలించిన ఇన్‌స్పెక్షన్ టీమ్



డాన్ బాస్కో హోమ్‌లో చిన్నారులతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్షన్ టీమ్ అధికారులు

కర్నూలు (అర్బన్): నగరంలోని పలు బాలబాలికలకు సంబంధించిన హోమ్స్‌ను డిస్ట్రిక్ట్ లెవల్ ఇన్‌స్పెక్షన్ టీమ్ శనివారం పరిశీలించింది. నగరంలోని సాయి ఎడ్యుకేషనల్ రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ గరల్స్, బాయ్స్, డాన్ బాస్కో ఫర్ బాయ్స్ హోమ్స్‌ను పరిశీలించి ఆయా హోమ్స్‌లో ఉన్న చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, సౌకర్యాలు, వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. రిజిస్టర్లను పరిశీలించారు. టీమ్‌లో బాలల పరిరక్షణ అధికారిణి టి.శారద, డిస్ట్రిక్ట్ ప్రొబేషన్ ఆఫీసర్ దివాకర్, బాలల పర్యవేక్షణ అధికారి బాషా, ప్రొటెక్షన్ ఆఫీసర్ జి.శ్రీలక్ష్మి, డి.పద్మ తదితరులు ఉన్నారు.

ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ



అవగహన కల్పిస్తున్న రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారి హేమలత

కర్నూలు సిటీ: ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగులను నివారించవచ్చని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారి హేమలత అన్నారు. శనివారం మండలంలోని ఉల్చాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి నులిపురుల నివారణపై ఆమె విద్యార్థులకు అవగాహన కల్పించారు. అయిదేళ్లలోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ, 6 నుంచి 19 ఏళ్ల వయస్సు విద్యార్థులకు పాఠశాలలు, కాలేజీల్లో ఆల్బెండజోల్ మందులు పంపిణీ చేస్తారన్నారు. ప్రతి ఒక్కరు భోజనానికి ముందు, మల విసర్జన తరువాత సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. ఈనెల 20న జరగాల్సిన జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని వచ్చే నెల 17వ తేదీకి వాయిదా వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివకుమార్, జనార్దన్, సామాజిక ఆరోగ్య కార్యకర్త విశాల పాల్గొన్నారు.


దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఏపీ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ సుబ్రమణ్యం

కర్నూలు సిటీ: దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని ఏపీ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ సుబ్రమణ్యం అన్నారు. శనివారం ట్రిపుల్‌ఐటీడీఎంలోని శ్రీకృష్ణ సెమినార్ హాల్‌లో ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు స్టూడెంట్ ఇండక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో ఎంతో క్రమశిక్షణ అవసరమని, ప్రతిరోజు ఏదో ఒక కొత్త అంశాన్ని నేర్చుకోవాలన్నారు. ఒత్తిడి లేని విద్య ఉన్నత స్థాయికి చేర్చుతుందని, సబ్జెక్టు పరంగా ఏదైనా అనుమానాలు ఉంటే అధ్యాపకులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. సమాజంలో గుర్తింపు అంత సులువుగా రాదని, నేర్చుకున్న విద్య పలువురికి ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. ఆయా రంగాల్లో రాణించిన గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు చదివితే పట్టుదల పెరుగుతుందన్నారు. దేశ సంస్కృతి గురించి సీబీ రావు రచించిన పుస్తకాన్ని తప్పకుండా ప్రతి ఒక్కరూ చదవాలన్నారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐడీడీఎం రిజిస్ట్రార్ గురుమూర్తి, ఆచార్య సత్యబాబు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి



మాట్లాడుతున్న సీపీఓ హిమ ప్రభాకరరాజు

కర్నూలు(సెంట్రల్): రానున్న ఐదేళ్లలో జిల్లా అభివృద్ధికి ముందస్తుగా ప్రణాళికలు రూపొందించాలని సీపీఓ హిమ ప్రభాకరరాజు అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో రెండో రోజు ఐదేళ్ల అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై కొనసాగిన వర్కుషాపులో ఆయన అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఐదేళ్ల కాలానికి అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి కలెక్టర్‌కు సమర్పించాలన్నారు. వాటిని రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతారన్నారు. అక్కడ ఆమోదం పొందిన తరువాత లక్ష్యాల సాధనకు కృషిచేయాల్సి ఉంటుందన్నారు. రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో 45 శాఖల అధికారులు పాల్గొన్నారు. రెండో శిక్షణలో జిల్లా గ్రామీణాభివృద్ధి పరిధిలో పొదుపు సంఘాలకు జీవనోపాదుల కల్పనపై ప్రణాళికల్లో ఏ విధంగా చేర్చాలనే అంశంపై అవగాహన కల్పించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడిచే వసతి గృహాల్లో విద్యార్థులకు కల్పించాల్సిన సదుపాయాలపై వివరించారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ జేడీ రంగలక్ష్మమ్మ, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటలక్ష్మమ్మ, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా పాల్గొన్నారు.

20న ఫ్లోర్ బాల్, షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 20న స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఫ్లోర్‌బాల్, షూటింగ్ బాల్ విభాగాల్లో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫ్లోర్ బాల్,షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఈశ్వర్‌నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో బాల బాలికలకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభ చాటి ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్ నెల 1, 2 తేదీల్లో నరసరావుపేటలో నిర్వహించనున్న 18 వ రాష్ట్ర స్థాయి ఫ్లోర్ బాల్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 9989982655 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

25 నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

కర్నూలు కల్చరల్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో ఈనెల 25, 26, 27 తేదీల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ ప్రవచకులు వైష్ణో కృప చైతన్య ప్రభు తెలిపారు. 25వ తేదీ ఉదయం 10 గంటల నుంచి శ్రవణ కీర్తన మహోత్సవం, 26వ తేదీ ఉదయం 8 గంటల నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవ వేడుకలు, 27వ తేదీ ఉదయం 8 గంటల నుంచి నందోత్సవం, శ్రీ వ్యాస పూజ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ

కర్నూలు(హాస్పిటల్): స్థానిక చిత్తారి వీధిలోని అనాథ పిల్లలకు ఉచిత డొనేషన్ కిట్‌లను ఐవైడీఎఫ్ ఇంటర్నేషన్ ఛారిటీ ఎయిడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. దంత వైద్యులు నౌషాద్, ప్రభుత్వ ఖాజీ ముతహర్ పర్యవేక్షణలో 50 మంది పిల్లలకు రెండు కిలోల బియ్యం, కిలో పప్పు, కిలో చక్కెర చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నౌషాద్ మాట్లాడుతూ నోటి పరిశుభ్రత, టూత్ బ్రషింగ్ విధానం, దంత ఆరోగ్యం గురించి వివరించారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఆనంద్, రైటర్ రఫీ.. పిల్లల్లో మెరుగైన జీవనప్రమాణాల కోసం ప్రోత్సహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మదరసా హెడ్ ఖాజీ ముతహర్ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగి మృతి

కర్నూలు (టౌన్): రోడ్డుప్రమాదంలో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి సయ్యద్ అబ్దుల్ రహిమాన్ (65) మృతిచెందాడు. నిర్మల్ నగర్‌లో ఉంటూ పంచలింగాల దర్గాలో ఇమామ్‌గా పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం బళ్లారి చౌరస్తా నుంచి ద్విచక్ర వాహనంపై పంచలింగాలకు బయలుదేరాడు. ఈక్రమంలో వెనుక నుంచి ఐచర్ వాహనం ఇతనని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ట్రాఫిక్ పోలీసులు క్షతగాత్రున్ని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు.

'నారాయణ' దాష్టీకం

– గైర్హాజరు పేరుతో విద్యార్థులను ఎండలో నిలబెట్టిన ప్రిన్సిపాల్

కర్నూలు సిటీ: జిల్లాలోని నారాయణ విద్యా సంస్థల ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండాపోతోంది. చదువుల పేరుతో విద్యార్థుల నుంచి ఫీజు రూపంలో నిలువు దోపిడి చేస్తూ ... చిన్నచిన్న కారణాలను సాకుగా చూపుతూ విద్యార్థులకు కఠిన శిక్షలు వేస్తూ మానసిక, శారీక వేధింపులకు పాల్పడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక గాయత్రి ఎస్టేట్‌లోని నారాయణ జూనియర్ కాలేజీలో చదువుతున్న బాలికలు కొందరు అనారోగ్య, వ్యక్తిగత కారణాలతో ఒకటి,రెండు రోజులు కాలేజీకి గైర్హాజరయ్యారు. వారు శనివారం కాలేజీకి హాజరుకాగా ప్రిన్సిపాల్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ నాల్గో ఫ్లోర్ పైభాగంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండకు కూర్చోబెట్టినట్లు సమాచారం. ఓ విద్యార్థి తనకు జ్వరం ఉందని, తగ్గకపోయినా తరగతులు మిస్ అవుతాననే ఉద్దేశంతో హాజరయ్యానని చెప్పినా ఏ మాత్రం కనికరం చూపలేదని ఆ విద్యార్థి కుటుంబీకులు వాపోయారు. సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వారు చెప్పారు.

చార్జింగ్ బంక్‌లొచ్చేశాయ్!







కర్నూలు నుంచి బెంగళూరు వెళ్లే 44వ నంబర్ జాతీయ రహదారిపై ఎలక్ట్రిక్ చార్జింగ్ బంకులు వెలిశాయి. ఈ మధ్య కాలంలో ఎలక్ట్రిక్ బైక్స్, కార్లు, ఆటోలు ఎక్కువ కావడంతో పెట్రోల్ బంకుల మాదిరిగా నగర శివారులో హైవే రోడ్లపై జెక్ట్, జెంటారితో పాటు మరికొన్ని ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్లు అక్కడక్కడా దర్శనమిస్తున్నాయి. హైదరాబాదు నుంచి బెంగళూరు వెళ్లే ఎలక్ట్రానిక్ వాహనదారులు ఈ స్టేషన్ల వద్ద అంతరాయం లేకుండా చార్జింగ్ ఫుల్ చేసుకుని వెళ్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

జూడాల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ, చిత్రంలో సూపరింటెండెంట్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): జూనియర్ డాక్టర్ల సంఘం ప్రతినిధులు రక్షణ, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మెడికల్ కాలేజీలోని ప్రిన్సిపాల్ చాంబర్‌లో ఏపీ జూడా ప్రతినిధులు, ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్, వైస్ ప్రిన్సిపాల్, ఆర్ఎంఓల ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. పని ప్రదేశంలో సీసీ కెమెరాలు, విద్యుద్దీపాలు, విశ్రాంతి గదులు తదితర సమస్యల గురించి జూడా ప్రతినిధులు ప్రస్తావించారు. ఎలక్ట్రిఫికేషన్‌కు సంబంధించి అదనపు లైట్లు వారంలోపు, సీసీ కెమెరాలు 15 రోజుల్లోపు ఏర్పాటు చేయిస్తామని, విశ్రాంతి గదులకు సంబంధించి ప్రస్తుతం ఉన్న అవకాశాలతో సర్దుబాటు చేసి శాశ్వత ప్రాతిపదికన సమస్య పరిష్కారానికి నివేదికలు పంపి అనుమతులు లభించిన వెంటనే వాటిని ఏర్పాటు చేస్తామని ప్రిన్సిల్, సూపరింటెండెంట్ హామీ ఇచ్చారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, డాక్టర్ రేణుక, డాక్టర్ సాయిసుధీర్, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్టల్ ఇన్‌చార్జ్ డాక్టర్ వి.శ్రీలత, డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్, జూడా ప్రతినిధులు డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ సునీల్, డాక్టర్ మనోజ్, డాక్టర్ వర్షిణి, డాక్టర్ భావన, డాక్టర్ అఖిల, డాక్టర్ మాధవరెడ్డి, డాక్టర్ దివ్య ఉన్నారు.

గ్రామాల్లో విస్తృత సేవలు అందిస్తాం



అతిథులచే సన్మానం అందుకున్న నూతన కార్యవర్గ సభ్యులు

కర్నూలు కల్చరల్: లయన్స్ ఇంటర్నేషనల్ గ్రామాల్లో విస్తృత సేవలు అందిస్తుందని పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ దుర్గా నాగేశ్వరరావు, లయన్ డాక్టర్ బాలమద్దయ్య అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం శనివారం వీఆర్ కాలనీలోని కేఎన్నార్ స్కూల్‌లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 1.4 మిలియన్ మెంబర్లతో 45 వేల క్లబ్‌లతో లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. లయన్ దుర్గా నాగేశ్వరరావు ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్‌గా నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేశారు. నూతన అధ్యక్షులుగా పి.సి.పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా టి.గోపీనాథ్, ఉపాధ్యక్షులుగా అశోక్‌కుమార్, నరసింహారావు, డాక్టర్ వి.రమేష్, గౌరవాధ్యక్షులుగా మహేంద్ర, షిప్ చైర్మన్‌గా రాయపాటి నాగలక్ష్మి, ఉప కార్యదర్శిగా బి.చిన్నస్వామి, సేవా కార్యక్రమాల చైర్మన్‌గా శివయ్య, సలహా కమిటీ చైర్మన్‌గా సత్యనారాయణ, క్లబ్ అడ్మినిస్ట్రేటర్‌గా డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌లు ప్రమాణ స్వీకారం చేశారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను అరికట్టాలి



కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న హిందూ చైతన్య వేదిక సభ్యులు

కర్నూలు (సెంట్రల్): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని హిందూ చైతన్య వేదిక అధ్యక్ష, కార్యదర్శులు నరేష్, మామిళ్లపల్లి రాజేష్, మాధవ డిమాండ్ చేశారు. అల్లరిమూకలు హిందువులను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతున్నా ఆ దేశ ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయన్నారు. శనివారం సాయంత్రం రాజ్‌విహార్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంగ్లాదేశ్ పరిణామాలను ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందూ సమాజం ఖండిస్తుందన్నారు. వెంటనే ఆ దేశంలో హిందువులకు రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. హిందువుల ఆస్తులను ధ్వంసం చేస్తున్న అల్లరి మూకలపై కేసులు పెట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.వాసురెడ్డి, శ్రీనివాసరెడ్డి, టీసీ మద్దిలేటి, ప్రతాప్‌రెడ్డి, గోరంట్ల రమణ పాల్గొన్నారు.

వృద్ధురాలికి అరుదైన శస్త్రచికిత్స



ఆపరేషన్ చేయించుకున్న లీలావతమ్మతో డాక్టర్ సూరా జానకిరామ్

కర్నూలు(హాస్పిటల్): నగరానికి చెందిన ఓ వృద్ధురాలికి కిమ్స్ హాస్పిటల్ డాక్టర్లు అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణం నిలిపారు. ఆ వివరాలను శనివారం హాస్పిటల్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ సూరా జానకిరామ్ విలేకరులకు వెల్లడించారు. కర్నూలు నగరానికి చెందిన 74 ఏళ్ల లీలావతమ్మకు మధుమేహం, అధిక రక్తపోటు సమస్యలతో పాటు బృహద్ధమని నుంచి చిన్నప్రేగులకు రక్తం సరఫరా అయ్యే రక్తనాళం వద్ద రక్తం గడ్డకట్టింది. చిన్న పేగులకు రక్తం సరఫరా నిలిచిపోయి దాదాపు 50 సెంటీమీటర్ల పేగు కుళ్లిపోయింది. దీంతో తీవ్రమైన కడుపునొప్పి, వాంతులతో ఇబ్బంది పడుతూ వారం క్రితం తమ కిమ్స్ హాస్పిటల్‌లో చేరిందని, పరీక్షించి రెండు దఫాలుగా శస్త్రచికిత్స చేసి ఆమె ప్రాణాలు కాపాడామని డాక్టర్ సూరా జానకిరామ్ తెలిపారు.

చైన్ స్నాచర్ అరెస్టు

– 21 తులాల బంగారం స్వాధీనం



దొంగను అరెస్టు చూపుతున్న సీఐలు

కర్నూలు (టౌన్): నగరంలో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న దొంగను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం రాత్రి మూడవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మూడవ పట్టణ సీఐ మురళీధర్ రెడ్డి, నాలుగవ పట్టణ సీఐ శంకరయ్య వివరాలు వెల్లడించారు. దేవనకొండ మండలం తెర్నేకల్ గ్రామానికి చెందిన వీరేష్‌కుమార్ కొంతకాలంగా కర్నూలు నగరంలో ఒంటరి మహిళలను టార్గెట్ చేసుకొని బంగారు గొలుసులు బలవంతంగా లాక్కెళ్లేవాడు. బాధితుల ఫిర్యాదుతో కేసులు నమోదు చేసుకున్న పోలీసులు పక్కా ప్రణాళికతో రామచంద్రమిషన్ వద్ద అనుమానంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా నేరం అంగీకరించాడు. అతడిని అరెస్ట్ చేసి రూ.6.60 లక్షల విలువ చేసే 210.75 గ్రాముల బంగారం, టీవీఎస్ స్టార్ సిటీ బైక్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేయడంతో ఎస్ఐ మన్మథ విజయ్, హెడ్ కానిస్టేబుల్ ఎంసీ రంగారావు, కానిస్టేబుల్స్ ఆర్ కిశోర్, జె వీరేష్ కీలకంగా వ్యవహరించినట్లు సీఐలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో క్రీడాకారిణి మృతి



లిఖిత రెడ్డి (ఫైల్)

కర్నూలు (టౌన్): రోడ్డు ప్రమాదంలో జాతీయ స్థాయి క్యారమ్స్ క్రీడాకారిణి లిఖిత రెడ్డి మృతి చెందారు. నంద్యాల జిల్లా మహానంది మండలానికి చెందిన ఈమె క్యారమ్స్ క్రీడాంశంలో ఎనిమిది సార్లు రాష్ట్ర జట్టు తరఫున పాల్గొని పతకాలు సాధించారు. తెలంగాణ రాష్ట్రం జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం ధర్మవరం బస్సు స్టేజీ సమీపంలో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె మృతి చెందారు. ఆమె మృతికి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్, శ్రీనివాసులు, క్యారెమ్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విరాజ్‌కుమార్, సంపతి, అబ్దుల్ జలీల్ సంతాపం తెలిపారు.

ఉరుకుంద క్షేత్రంలో భక్తుల సందడి

కౌతాళం: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా రెండో శనివారం ఉరుకుంద ఈరన్నస్వామిని దర్శించుకోవడానికి భక్తులు ఉదయం నుంచే తరలివచ్చారు. దీంతో స్వామి క్షేత్రంలో సందడి నెలకుంది. శ్రావణమాసంలో శనివారం కూడా అధికంగా స్వామి సన్నిధిలో గడపడానికి రావడంతో ఎటూ చూసినా భక్తులే కనిపించారు. ఉదయం నుంచే భక్తులు క్యూలైన్‌లో నిలబడి స్వామిని దర్శించుకున్నారు. దేవాలయ అధికారులు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక దర్శనంతో పాటు, శీఘ్ర దర్శనం, అతిశీఘ్ర దర్శనం, ఉచిత దర్శనం, విఐపీ దర్శనం కల్పించడంతో దర్శనం సాఫీగా సాగుతోంది.

నేడు ఇస్కాన్ నగర సంకీర్తన

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు నగర సంకీర్తన నిర్వహించనున్నట్లు ఇస్కాన్ కర్నూలు బాధ్యులు రఘునందన సేవక ప్రభు పేర్కొన్నారు. భగీరథ కాంప్లెక్స్‌లోని ఇస్కాన్ మందిరం నుంచి సంకీర్తన బృందం బయలుదేరి నగరంలోని ప్రధాన కూడళ్లలో హరే కృష్ణ హరే రామ జపం చేయనున్నట్లు పేర్కొన్నారు.